సాక్షి
వరంగల్
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025




మార్కెట్‌లో మౌలిక వసతులేవి?
వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మౌలిక వసతులు లేవంటూ అడ్తి వ్యాపారులు, ఖరీదు దారులు మంగళవారం ధర్నా చేశారు.
- 8లో▸



మినీ జాతరకు వేళాయె..
మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర కు వేళయింది. నేటి (బుధవారం) నుంచి పూజ కార్యక్రమాలు మొదలుకానున్నాయి.
- 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34°/18°
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణం గా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఎండ ఉం టుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగ మంచు కురుస్తుంది.

వారికీ.. హెల్మెట్ తప్పనిసరి!



పిలియన్ రైడర్లు ధరించాల్సిందే
- 2022 నుంచి ఇప్పటివరకు పదివేలకుపైగా చలాన్లు
- రూ.కోటికిపైగా జరిమానా విధించిన ట్రాఫిక్ పోలీసులు
- ఈ ఏడాది ఒక్క జనవరిలోనే 234 మందికి చలాన్లు

సాక్షి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 10 శాతం మంది పిలియన్ రైడర్లు (బైక్ నడిపే వారి వెనకాల కూర్చొనే వ్యక్తులు) ప్రాణాలు కోల్పోతున్నారు. వాటిని తగ్గించే దిశగా పోలీసులు పక్కా కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. హెల్మెట్ లేదని 2022 సంవత్సరం నుంచి ఇప్పటివ రకు 10,359 మంది పిలియన్ రైడర్లకు చలాన్ల రూపంలో సుమారు రూ.1,03,59,000 జరిమానా విధించారు. అదేసమ యంలో 39 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. 2022లో ద్విచక్ర వాహనదారుడితోపాటు పిలియన్ రైడర్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధనను వరంగల్ పోలీసులు కఠినతరం చేశారు. ఆ ఏడాది ఏకంగా 7,389 చలాన్లు విధించారు. అనంతరం వాహ నదారుల్లో మార్పు రావడంతో తర్వాత రెండేళ్లలో భారీగా తగ్గు ముఖం పట్టాయి. మళ్లీ ఈ ఏడాది ఒక్క జనవరిలోనే 234 పిలియన్ రైడర్లకు హెల్మెట్ ధరించని కేసులు నమోదయ్యాయి. మరో 11 నెలల సమయం ఉండడంతో భారీగా పెరిగే అవకాశ ముందని ట్రాఫిక్ పోలీసులు అంచనా వేస్తున్నారు. మోటారు వెహికల్ యాక్ట్–2019 ప్రకారం పిలియన్ రైడర్లకు హెల్మెట్ విష యంలో కఠినంగా ఉంటామని అవగాహన కలిగిస్తున్నారు.

ప్రాణాలతో భద్రంగా ఉండాలనే..



రోడ్డు ప్రమాదాల్లో పిలియన్ రైడర్ల మృతుల సంఖ్యను తగ్గించేందుకు ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నాం. పలు ప్రమాదాల్లో వెనకాల కూర్చున్న పిలియన్ రైడర్లు కూడా ప్రాణాలు కోల్పోతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అందుకే పిలియన్ రైడర్లకు హెల్మెట్ నిబంధన విషయంలో కఠినంగా ఉంటున్నాం. చాలా వరకు వాహనదారుల్లో మార్పు వచ్చింది. దీనివల్ల వారి కుటుంబాలు సంతోషంగా ఉండే అవకాశం ఉంది.
- అంబర్ కిశోర్ ఝా,
వరంగల్ పోలీస్ కమిషనర్

పిలియన్ రైడర్ల చలాన్లు ఇలా..	సంవత్సరం	2022	2023	2024	2025
	చలాన్లు–వాహనాల సీజ్	7,389-3	2,076-13	660-22	234-1

న్యూస్‌రీల్

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నర్సంపేట రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన నర్సంపేట పట్టణంలోని శాంతినగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన చెంది న రేణుక నర్సంపేట విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచే స్తోంది. మంగళవారం ఆమె విధులకు వెళ్లగా సాయంత్రం సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. వం టసామగ్రితోపాటు, రూ.30వేల నగదు, ఫర్నిచ ర్, పూర్తిగా దగ్ధమైంది. దీని విలువ రూ.3 లక్ష లు ఉంటుందని స్థానికులు తెలిపారు. నర్సం పేట డీఈ తిరుపతి ఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. రేణుకకు ధైర్యం చెప్పి రూ.10 వేల ఆర్థిక సాయం, వంటసామగ్రి అందించారు. ఇంటిపై రేకులు వేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీఈ వెంట ఏఈలు, సిబ్బంది తదిత రులు ఉన్నారు.

ఓవర్‌లోడ్ లారీలతో ఇబ్బందులు



నల్లబెల్లి: గుండ్లపహాడ్‌లోని ఎఫ్‌సీఐ గోదాంలకు ఓవర్‌లోడ్‌తో వస్తున్న బియ్యం లారీలతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బజ్జుతండా గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు లారీలను అడ్డుకుని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ నర్సింహమూర్తి, గోదాంల మేనేజర్ సమీర్ వారి వద్దకు చేరుకొని చర్చించారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు రవిచిన్న మాట్లాడుతూ ఓవర్‌లోడ్ లారీల రాకతో రోడ్డు ధ్వంసమవుతోందని, దుమ్ముధూళితో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లారీలు మరో మార్గం గుండా వెళ్లాలని సూచించారు. ఎఫ్‌సీఐ అధికారులు గుండ్లపహాడ్ గ్రామానికి చెల్లిస్తున్న పన్నులో బజ్జుతండాకు వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంసింగ్, రాజు, మోహన్, కొమ్మాలు, సంతోష్, సామ్య, చందర్, దాద్యి, సుధాకర్, రాందాస్, ఖాసీం, కొమ్మాలు పాల్గొన్నారు.

గీతకార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రాయపర్తి: రాష్ట్ర ప్రభుత్వం గీతకార్మికులను నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకటమల్లయ్య అన్నారు. కొండూరు గ్రామ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా ప్రధానకార్యదర్శి వీరస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 అక్టోబర్ 18న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించి 22 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. గీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరును నామకరణం చేయాలని, తాటిచెట్లు నరికివేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల నాయకులు పులి సోమయ్య, నాలం రవి, బాలగోయిన రాంబాబు, టీసీఎస్ అధ్యక్షుడు మేరుగు రమేష్, బాలగోని భిక్షపతి, మండల నరేందర్, కోలుకొండ నారాయణ, చిలువేరు అంజయ్య పాల్గొన్నారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్‌ఎల్ సౌజన్య తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంఎల్‌ఐఎస్సీ కోర్సుల (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 24, 27, మార్చి 1, 3 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

‘ఉపాధి’ బాటలు..

- రైతులు పంటపొలాలకు వెళ్లేందుకు నిర్మాణం
- జిల్లాలో 57 పొలం బాటలు మంజూరు
- మార్చి నెలాఖరులోగా పనుల పూర్తికి అధికారుల కసరత్తు

నల్లబెల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులకు సంబంధించిన పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం పొలం బాటలను నిర్మించనుంది. ఈ పనులు మార్చి 31 వరకు పూర్తిచేసేందుకు అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. జిల్లాలోని 11 గ్రామీణ మండలాల్లో 323 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పంటపొలాలకు వెళ్లేందుకు ప్రభుత్వం బాటలు నిర్మించనుంది. రైతులకు ఉపయోగపడేలా 55 పొలం బాటలు నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతుల అవసరాల మేరకు లక్ష్యానికి మించి అధికారులు 57 పొలం బాటల నిర్మాణానికి మంజూరు ఇచ్చారు. కాగా, ఆయా గ్రామాల్లో 16 పనులు ప్రారంభించారు. కాగా, ప్రతి కిలో మీటరుకు రూ.10 లక్షల వ్యయంతో 1,920 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకుపోతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ అధికారులు పేర్కొంటున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తోంది నల్లబెల్లి మండలంలోని బజ్జుతండా శివారులో రైతులు పొలాలకు వెళ్లే దారి. దాదాపు 120 ఎకరాలకు పైగా భూములున్నాయి. 40 మంది రైతులు ఈదారి మీదుగానే పంటలు సాగు చేసేందుకు వెళ్తారు. సరైన బాటలేక వారికి కష్టాలు తప్పడం లేదు. వర్షాకాలంలో అడుగుతీసి అడుగు వెయ్యలేని పరిస్థితి ఉంటుంది. వాహనాలు, ఎడ్లబండ్లు వెళ్లలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై దృష్టిసారించిన రాష్ట్ర ప్రభుత్వం పొలం బాటలకు నిధులు కేటాయించింది. అధికారులు సర్వే కూడా పూర్తిచేశారు. ఈ పనులు సకాలంలో పూర్తిచేస్తే రైతుల ఇక్కట్లు తీరనున్నాయి.

పనులు సకాలంలో పూర్తిచేస్తాం



జిల్లాలోని రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు కేటాయించింది. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పొలం బాటలను గుర్తించాం. అధికారులను సమన్వయం చేస్తూ మార్చి 31 నాటికి పొలం బాటల పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.
- కౌసల్యాదేవి, డీఆర్‌డీఓ

ఆస్పత్రులకు నిరంతర విద్యుత్

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అధికారులతో సమీక్ష

వరంగల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అత్యవసర ఆస్పత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఎంజీఎం, సీకేఎం ప్రసూతి, ప్రాంతీయ కంటి ఆస్పత్రుల్లోని జనరేటర్లను ఆటోమోడ్‌లో ఉండేలా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో ఎన్పీడీసీఎల్ ఎస్సీ మధుసూదన్‌రావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, పర్యవేక్షకులు కిశోర్, పద్మావతి, ఆర్‌ఎంఓలు మురళి, వంశీప్రియ, సత్యజిత్‌రే తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

7 నుంచి జిల్లాస్థాయి యువజన క్రీడోత్సవాలు

వరంగల్: ఓసిటీ క్రీడా మైదానంలో ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాస్థాయి యువజన క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తాలుకా స్థాయిలో నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన క్రీడాపోటీల విజేతలు క్రీడల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. 15 నుంచి 20 ఏళ్లలోపు వారికి వాలీబాల్, రన్నింగ్, షటిల్ సింగిల్స్, యువతులకు కబడ్డీ, షటిల్ సింగిల్స్, రన్నింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లతోపాటు జ్ఞాపికలు అందిస్తామని, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 99080 69469/95024 49469 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

10న డీవార్మింగ్ డే

- 1,81,807 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సాంబశివరావు

గీసుకొండ: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (డీవార్మింగ్ డే) సందర్భంగా జిల్లాలో ఈనెల 10న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు మైక్రోయాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. సాంబశివరావు తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నులిపురుగుల నివారణపై వైద్యాధికారులు, సిబ్బందికి మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మొత్తం 1,810 పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,81,807 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేసేందుకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. 1–2 ఏళ్ల వారికి సగం టాబ్లెట్‌ను పొడిచేసి నీళ్లలో వేసి తాగించాలని, 2–19 ఏళ్ల వయస్సు వారికి పూర్తి టాబ్లెట్‌ను నమిలి మింగించాలని కోరారు. నులిపురుగులు శరీరంలో ఉంటే శారీరక, మానసిక అభివృద్ధి జరగదని, రక్తహీనతతో చదువుపై శ్రద్ధలేకపోవడం వంటి తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మిగిలిపోయిన విద్యార్థులకు 17న ట్యాబ్లెట్లు వేస్తారన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ మోహన్‌సింగ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అర్చన, డాక్టర్ రవీందర్, డాక్టర్ విజయ్‌కుమార్, డబ్ల్యూహెచ్‌ఓ సర్వేలైన్స్ అధికారి డాక్టర్ అతుల్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

క్యాన్సర్ నివారణకు కృషి చేయాలి

జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బంది క్యాన్సర్ నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. సాంబశివరావు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయని డీఈఓ?

- పదేళ్లుగా డిప్యుటేషన్‌లో ఉన్న వ్యక్తిని రిలీవ్ చేయాలని కలెక్టర్ మెమో
- డీఈఓ అమలు చేయడం లేదంటున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కాశీబుగ్గ సెంటర్: డీఈఓ కార్యాలయంలో ఫారన్ డిప్యుటేషన్‌పై విధులు కొనసాగిస్తున్న ఆర్.రాజగోపాల్‌రెడ్డి డిప్యుటేషన్ రద్దు చేసి వెంటనే విధుల నుంచి విడుదల చేయాలని, అదేవిధంగా డీఐఈటీ మనోజ్‌ను హనుమకొండ డీఈఓ కార్యాలయానికి పంపాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఈ నెల 1న డీఈఓను ఆదేశిస్తూ మెమో జారీ చేశారు. ఈ విషయంపై ఇప్పటివరకు డీఈఓ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విద్యాశాఖ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కలెక్టర్ మెమోను ఖాతరు చేయడం లేదన్న టాక్ వినిపిస్తోంది. విద్యాశాఖ కార్యాలయంలో అవకతవకలు జరిగినట్లు, డీఈఓ వ్యవహారశైలిపై పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జనవరి 28న కలెక్టర్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. డీఈఓ కార్యాలయంలో సుదీర్ఘంగా ఉంటున్న ఆర్.రాజగోపాల్‌రెడ్డి డిప్యుటేషన్ రద్దు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ధర్మసాగర్ మండలం మల్లికుదుర్ల ఎంపీపీఎస్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉన్న ఆర్.రాజగోపాల్‌రెడ్డిని జిల్లాల పునర్విభజనలో భాగంగా వరంగల్ జిల్లాకు కేటాయించారని, సందర్భం(2)ను అనుసరించి ఏ ఉద్యోగి అయినా గరిష్ఠంగా మూడేళ్లు లేదా ప్రజా ప్రయోజనాల రీత్యా ఐదేళ్లు సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫారిన్ డిప్యుటేషన్ (విదేశీ ప్రతినిధి)లో కొనసాగవచ్చని వివరించారు. కానీ, ఎస్జీటీగా విద్యార్థులకు బోధించాల్సిన రాజగోపాల్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా పదేళ్లుగా వరంగల్ డీఈఓ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారని తెలిపారు. అతడిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారించి డిప్యుటేషన్ రద్దు చేసేలా డీఈఓను ఆదేశించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్.. వెంటనే కార్యాలయ సిబ్బందితోపాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి అసలు ఏం జరిగిందని తెలుసుకున్నట్లు సమాచారం. రాజగోపాల్ ఎవరు.. ఎక్కడ డ్యూటీ చేయాలి.. ఎంతకాలం నుంచి డిప్యుటేషన్‌లో పనిచేస్తున్నావు అని అడిగి తెలుసుకొని వెంటనే తనకు మంచి స్కూల్ కేటాయించి పంపాలని డీఈఓను ఆదేశిస్తూ ఈనెల 1న మెమో జారీ చేశారు. కాగా, దీన్ని డీఈఓ జ్ఞానేశ్వర్ అమలు చేయడం లేదని, కలెక్టర్ ఆదేశాలను సైతం ఖాతరు చేయడం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలుపుతున్నారు. ఈ విషయమై డీఈఓ జ్ఞానేశ్వర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



రాజగోపాల్‌రెడ్డి డిప్యుటేషన్ రద్దు చేయాలని కలెక్టర్ జారీ చేసిన మెమో

46 సంవత్సరాల అనుబంధం!



సమ్మేళనంలో పాల్గొన్న 1978–79 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

- గిర్నిబావిలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం
- సందడి చేసిన 1978–79 టెన్త్ బ్యాచ్

దుగ్గొండి: వారంతా ఉద్యోగాల నుంచి రిటైర్ అయ్యారు.. తాతయ్యలు.. అమ్మమ్మలు అయ్యారు. 46 ఏళ్ల క్రితం విడిపోయి ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒక్కచోట కలుసుకున్నారు. చిన్న పిల్లలుగా మారి కాసేపు అల్లరి చేశారు. మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978–79 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన వారంతా మంగళవారం గిర్నిబావిలోని వందన గార్డెన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. నాటి గుర్తులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు బాగోగులు, కష్టసుఖాలు, కుటుంబ విషయాలు అడిగి తెలుసుకున్నారు. కబుర్లు చెప్పుకుంటూ చిన్న పిల్లలుగా కాసేపు అల్లరి చేశారు. ప్రతి సంవత్సరం ఒకసారి కలుసుకోవాలని, ఎవరికి ఏ కష్టం వచ్చినా అందరు వెళ్లి ధైర్యం చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఉద్యోగ విరమణ పొందిన గోవర్ధన్‌రెడ్డి, ప్రకాశ్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు చక్రపాణి, సాయిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, సంజీవరెడ్డి, పెద్దన్న, లీల, రమాదేవి, విమల, హైమావతి, స్వరూప, పద్మ పాల్గొన్నారు.

మామిడిలో పూతను కాపాడుకోవాలి

- జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి



మామిడిలో పూతను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి

దుగ్గొండి: మామిడిలో పూతను జాగ్రత్తగా కాపాడుకుంటేనే దిగుబడి వస్తుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. మండలంలోని ముద్దునూరు, చలపర్తి గ్రామాల్లో మంగళవారం ఆమె మామిడితోటలను పరిశీలించి మాట్లాడారు. పూతలో ఉన్న మామిడికి నీటిని చాలా తక్కువగా ఇవ్వాలన్నారు. నీటిని ఎక్కువగా ఇస్తే తామరపురుగు, తేనె మంచు పురుగు, బూడిద రోగం ఆశిస్తాయని పేర్కొన్నారు. నిక్కుడు పురుగు (సెమీ లూపర్), తేనెమంచు పురుగు, తామర పురుగు, బూడిద రోగం నివారణకు 500 లీటర్ల నీటిలో పోలీస్ మందు (ఇమిడాక్లోప్రిడ్, ఫిప్రోనిల్) 100 గ్రాములు, ఇమామెక్టిన్ బెంజీయోట్ 250 గ్రాములు, మారినో లీటరు, బోరాన్ 500 గ్రాములు, హెక్సాకోనాజోల్ ఒక లీటరు కలిపి చెట్టు అంతా తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. దీంతో పూత దక్కుతుందని ఆమె తెలిపారు.

ఆఖరి మజిలీలో ఆకలి కేకలు

- అందరూ ఉన్నా అనాథైన అవ్వ
- చలికి వణుకుతూ కాలం వెళ్లదీత
- షాపుల ఎదుట గద్దెలపై జీవనం
- పట్టించుకోని సంతానం

వరంగల్: పస్తులుండి.. తమకు పుట్టినవారిని సాకారు. పెంచి పెద్ద చేసి ఉన్నతుల్ని చేశారు. కడుపున పుట్టినందుకు కనీసం కనికరంచూపకుండా వారు మాత్రం తల్లిని రోడ్డుపై వదిలేశారు. ఆఖరి మజిలీలో అవ్వ ఆకలంటూ కేకలు వేస్తోంది. చలిపులి భయానికి వణుకుతోంది. కాశిబుగ్గ పోచమ్మగుడి సమీపంలో వృద్ధురాలు కొత్తకొండ బుచ్చమ్మ దీనావస్థలో కాలం వెళ్లదీస్తోంది. కొత్తకొండ బుచ్చమ్మ, నారాయణ(90)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరు రామన్నపేటలో ఉంటారు. బుచ్చమ్మ, నారాయణ దంపతులు పాతికేళ్లుగా కాశిబుగ్గలో ఉంటున్నారు. బుచ్చమ్మ బీడీలు చుడితే.. నారాయణ మిషన్ కుడుతూ జీవించారు. కుమారులు, కుమార్తె పట్టించుకోకపోవడం.. వృద్ధులవ్వడంతో ఆదరణ కరువై మానసికంగా కుంగిపోయా రు. దీనికి తోడు వారిని ఓనర్ ఇంటిని ఖాళీ చేయించాడు. ఎవరూ ఇల్లు అద్దెకు ఇవ్వకపోవడంతో వృద్ధులిద్దరినీ ఆమె కుమార్తె వారి ఇంటికి తీసుకెళ్లింది. 15 రో జుల అనంతరం నారాయణ చనిపోవడంతో కార్యక్రమాలు పూర్తి కాగానే బుచ్చమ్మను కొడుకులు రోడ్డు మీదికి తరిమారు. దిక్కుతోచని స్థితిలో షాపుల ఎదు ట, తెలిసిన వారి ఇంటి గద్దెల మీద అవ్వ కాలం వెళ్లదీస్తోంది. కాగా.. ఆమె కుమారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు బుచ్చమ్మకు ఆశ్రయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



దీనావస్థలో బుచ్చమ్మ

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు

కాజీపేట రూరల్: కాజీపేటకు చెందిన ముగ్గురు పవర్‌లిఫ్టర్లు ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ బెంచిప్రెస్ చాంపియన్‌షిప్–25 పోటీలో గోల్డ్‌మెడల్స్ సాధించారు. కాజీపేట కడిపికొండ రాంనగర్‌కు చెందిన ఎండీ.జాఫర్ 59 కిలోల విభాగంలో ప్రథమ స్థానం, కాజీపేట సోమిడికి చెందిన దామెరుప్పుల మొగిలి 54 కిలోల విభాగంలో ప్రథమ స్థానం, కడిపికొండ రాంనగర్‌కు చెందిన కుక్కల ఉమాసాయి 105 కిలోల కేటగిరీలో ఐదో స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం సులువు

● మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల



డ్రోన్ స్ప్రేయర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్మల

వరంగల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం వల్ల వ్యవసాయంలో సులువుగా పనులు చేయొచ్చని వరంగల్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల అన్నారు. మార్కెట్‌లోని మన అగ్రిటెక్‌లో మంగళవారం డ్రోన్ స్ప్రేయర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో మానవ లోకం ఎంతో ముందడుగు వేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం చే ఆమోదించిన ప్రముఖ దక్ష కంపెనీ రూపొందించిన డ్రోన్ స్ప్రేయర్లను రైతులకు మన అగ్రిటెక్ అధినేత పాశికంటి రమేశ్ అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మన అగ్రిటెక్ ఎండీ రమేశ్ మాట్లాడుతూ.. డ్రోన్ 10 లీటర్ల నీటి సామర్థ్యంతో ఎకరా కేవలం 5–7నిమిషాల వ్యవధితో పిచికారీ చేస్తుందని, ఒకసారి బ్యాటరీ చార్జ్ చేస్తే 3ఎకరాల వరకు పనిచేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రావు, నూతనకల్ పీఏసీఎస్ చైర్మన్ జయసుధ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో బాలికపై లైంగికదాడి

● గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి..
● తల్లిదండ్రుల ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసు

ఖిలా వరంగల్: బాలికను ప్రేమపేరుతో ఓ యువకుడు లైంగికంగా లోబర్చుకున్నాడు. చివరికి ఆమె గర్భవతి కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మంగళవారం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతానికి చెందిన బాలిక (16) ఇంటర్మీడియట్ చదువుతోంది. కాలేజీకి వెళ్లి వచ్చే క్రమంలో ఇదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆదిల్ (20), బాలిక మధ్య పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త రెండేళ్లుగా ప్రేమగా మారింది. కొద్ది నెలలుగా ప్రేమ, పెళ్లి పేరుతో ఆ బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలికకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో తల్లిదండ్రులు వైద్యులకు చూపించగా గర్భవతి అని తేలింది. ఈవిషయంపై తల్లిదండ్రులు బాలికను నిలదీయడంతో విషయం చెప్పింది. మంగళవారం మిల్స్‌కాలనీ పీఎస్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించగా గర్భవతని తెలిసింది. ప్రేమ, పెళ్లి పేరుతో లైంగికదాడికి పాల్పడి బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

పోలీసుల అదుపులో యువకుడు..

ప్రేమ,పెళ్లి పేరుతో బాలికకు లైంగికంగా దగ్గరై గర్భవతిని చేసిన యువకుడిని మంగళవారం సాయంత్రమే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

మార్కెట్‌లో మౌలిక వసతులేవి?

● వైఫై, పీఓఎస్ మిషన్లు లేక ఇబ్బందులు
● మొక్కుబడిగా వైద్యసేవలు
● వసతులు కల్పించాలని అడ్తి వ్యాపారులు, ఖరీదుదారుల ధర్నా
● రెండు గంటల పాటు నిలిచిన కాంటాలు, క్రయ,విక్రయాలు
● అధికారుల హామీతో ధర్నా విరమణ.. కొనసాగిన మిర్చి కొనుగోళ్లు



మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యాపారులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్.. ఆసియా ఖండంలోనే అతిపెద్దది. ఇక్కడికి రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తమ పంట సరుకుల విక్రయానికి వస్తారు. తమ పంట ఉత్పత్తుల విక్రయాలకు రైతులు.. కొనుగోలు చేసేందుకు వందలాది మంది వ్యాపారులు.. కాంటాలు వేసేందుకు దడవాయిలు, హమాలీలు, కార్మికులు.. ఇలా మొత్తం సుమారు రెండు వేల నుంచి ఐదు వేల మంది వరకు నిత్యం మార్కెట్‌కు వస్తుంటారు. ఈ క్రమంలో ఇంతటి ప్రాధాన్యం కలిగిన మార్కెట్‌లో మౌలిక వసతులు లేవంటూ మంగళవారం అడ్తి వ్యాపారులు, ఖరీదుదారులు మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ ధర్నాతో కాంటాలు నిలిచిపోయాయి. దీంతో మిర్చి కొనుగోళ్లు నిలిచాయి. సోమవారం అడ్తివ్యాపారి కడారి సదానందం మార్కెట్‌లోని ఓ హోటల్ వద్ద టీ తాగుతూ గుండెపోటుతో మృతి చెందాడు. అతడి మృతికి సంతాపం వ్యక్తం చేసిన అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ యార్డులలో క్లీనింగ్ లేకపోవడం, రవాణా వాహనాలు, మిర్చి ఘాటుతో గుమస్తాలు, దడువాయిలు, రైతులు, హమాలీ కార్మికులు, వ్యాపారులు అనారోగ్యంతో చనిపోతున్నారన్నారు. అత్యవసర సమయాల్లో బాధితులకు చికిత్స చేయడానికి 24 గంటలు మార్కెట్‌లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్నారు. అలాగే, మార్కెట్‌లో వైఫై లేక పీఓఎస్ యంత్రాలు సరిగా పనిచేయడంలేదన్నారు. ఫలితంగా కాంటాలు ఆలస్యం కావడం, చోరీలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు సమకూర్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు లిఖితపూర్వకంగా విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల ఘటనాస్థలికి చేరుకుని మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి చర్చించిన అనంతరం మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం కాంటాలు జరగడంతో యథావిధిగా మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో చాంబర్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లే సంపత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వసతుల కల్పనపై జేడీఎం సమీక్ష..

మార్కెట్‌లో మౌలిక వసతులపై వ్యాపారులు ధర్నా నిర్వహించడంతో మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్, జేడీఎం శ్రీనివాస్ అధికారులతో సమావేశమయ్యారు. ఉన్నతాధికారుల అనుమతితో మార్కెట్‌లో వసతులు కల్పిస్తామని చాంబర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. సమీక్షలో మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, గ్రేడ్ 2 కార్యదర్శులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



కాంటాలు నిలిచిపోవడంతో బస్తాలపై కునుకు తీస్తున్న రైతులు

పీఓఎస్ మిషన్లు సమకూర్చాలి



మార్కెట్‌లో 120 మంది దడవాయిలం ఉన్నాం. ప్రస్తుతం 40 పీఓఎస్ మిషన్లు మాత్రమే పనిచేస్తున్నాయి. 80 మిషన్లు వస్తున్నాయని రెండేళ్లుగా అంటున్నారే తప్పా రావడం లేదు. కార్యదర్శి 10 మిషన్లు వచ్చాయని చెప్పారు. వాటిలో యాప్ ఇన్‌స్టాల్ చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

-సోల రవి, దడవాయి యూనియన్ సెక్రటరీ

సౌకర్యాలు కల్పించాలి



మార్కెట్‌లో ఎండ వేడి తట్టుకోలేకపోతున్నాం. విశ్రాంతి భవనంలో వసతులు సమకూర్చాలి. మూత్రశాలలు శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే, మార్కెట్‌లోని మెడికల్ సెంటర్‌లో వైద్య సౌకర్యాలు కల్పించాలి.

-పసునూటి మల్లయ్య, రైతు, ఇల్లంతకుంట మండలం, కరీంనగర్

తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలి



మార్కెట్‌లో యార్డు చుట్టూ నల్లాలు ఉన్నా నీళ్లు సరిగా రావడం లేదు. లోపలకు వెళ్తే ఎందుకు వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలి. కార్మికులు అస్వస్థతకు గురైతే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి. అంబులెన్స్ ఉంటే వ్యాపారి బతికేవాడు.

-అప్సర్ హమాలీ కార్మికుడు

మార్కెట్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి



నిత్యం వేలాది మంది రైతులు, వ్యాపారులు, కార్మికులు ఉండే మార్కెట్‌లో వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీ(బస్తీ దవాఖాన)ఏర్పాటు చేయాలి. గుండెపోటుకు గురైన వ్యాపారిని సకాలంలో 108లో ఆస్పత్రికి తరలిస్తే బతికేవాడు.

-డి.కరుణాకర్, గుమస్తాల సంఘం నాయకుడు

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి దుర్మరణం

● మేడ్చల్‌లో ఘటన.. మృతుడు శనిగపురం వాసి



శ్రీచరణ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ వైద్యుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటనతో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాస్, వాణి దంపతుల పెద్ద కుమారుడు శ్రీచరణ్ (26) మేడ్చల్ జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్తుండగా మేడ్చల్ జిల్లా కేంద్రంలోని క్రాస్ వద్ద కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీచరణ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసి మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వెంటనే మేడ్చల్ వెళ్లారు.

ఇంటికి నీళ్లు కొడుతుండగా..

● విద్యుదాఘాతంతో యువకుడి మృతి
● రాయికుంట తండాలో ఘటన



సతీశ్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఇంటికి నీళ్లు కొడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ మండలం ఉత్తర తండా జీపీ పరిధిలోని రాయికుంట తండాలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బోడ రాంసింగ్, బుజ్జి దంపతులు నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ దంపతుల చిన్నకుమారుడు సతీశ్ (23) స్విచ్ బోర్డుకు విద్యుత్ తీగలను అమర్చి కొంత సమయం తర్వాత మోటారు ఆన్ చేసి ఇంటికి నీళ్లు కొడుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ వైరు కిందపడగా తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు రూరల్ ఎస్సై దీపిక తెలిపారు. మృతుడికి భార్య బిందు, మూడు నెలల కుమార్తె ఉంది.

మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఈనెల 7,8,9 తేదీల్లో జరగనున్న మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్‌ను హైదరాబాద్‌లో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ ఈ.శ్రీధర్ ఆవిష్కరించారు. మంగళవారం ఆర్జేసీ రామకృష్ణారావు, ఈఓ ఎస్.మహేశ్, ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ హైదరాబాద్ వెళ్లి వేర్వేరుగా వాల్‌పోస్టర్‌ను ఉన్నతాధికారులతో ఆవిష్కరింపజేశారు. అనంతరం ఆహ్వాన పత్రికలు అందజేశారు.

మినీ జాతరకు వేళాయె..

● నేడు మేడారం, కన్నెపల్లిలోని ఆలయాల్లో గుడి మెలిగె పండుగ
● వనదేవతల జాతరకు ఏర్పాట్లు సిద్ధం



కన్నెపల్లిలోని సారలమ్మ గుడి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర(మండమెలిగె పండుగ)కు వేళయింది. నేటి(బుధవారం) నుంచి పూజ కార్యక్రమాలు మొదలు కానున్నాయి. ఇందులో భాగంగా మేడారంలోని సమ్మక్క గుడి, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో గుడిమెలిగె పండుగ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమ్మక్క పూజారులు ఉదయం సమ్మక్క గుడికి చేరుకుని అమ్మవారి వస్త్రాలు, పూజ సామగ్రిని శుద్ధి చేస్తారు. గుడిని శుద్ధి చేసిన తర్వాత సిద్ధబోయిన మునీందర్ ఇంటి నుంచి పూజారులు, ఆడపడుచులు డోలివాయిద్యాలతో పసుపు, కుంకుమ తీసుకుని సమ్మక్క గుడికి వెళ్తారు. గుడిలో అప్పటికే పూజారి కొక్కెర కృష్ణయ్య అలికి సిద్ధంగా ఉంచిన అమ్మవారి శక్తిపీఠంపై ఆడపడుచులు ముగ్గులు వేసి అలంకరిస్తారు. అనంతరం అడవి నుంచి తీసుకొచ్చిన ఎట్టిగడ్డిని సమ్మక్క గుడి భవనం ఈశాన్యం మూలన పెడతారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో..

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని సారలమ్మ పూజారులు, ఆడపడుచులు కలిసి శుద్ధి చేస్తారు. అమ్మవారి గుడిలో, ఆవరణలో ముగ్గులు వేస్తారు. సారలమ్మ వస్త్రాలు, పూజ సామగ్రిని ప్రధాన పూజారి సారయ్య శుద్ధి చేస్తారు. సారలమ్మ వడ్డె కుండలను పసుపు, కుంకుమతో ఆడపడుచులు అలంకరిస్తారు. అనంతరం గుడిలో పూజారులు అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. మండమెలిగె పండుగకు వారానికి ముందు గుడిమెలిగె పండుగను నిర్వహిస్తారు. ఈనెల 12వ తేదీన (బుధవారం) మేడారం, కన్నెపల్లిలో మండమెలిగె పండుగ నిర్వహించనున్నారు. గుడిమెలిగె పండుగతో పూజ కార్యక్రమాలు మొదలు కానున్నాయి.

జాతరకు ఏర్పాట్లు సిద్ధం..

మినీ మేడారం జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని అధికారురులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. జాతరలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క.. అధికారులను ఇప్పటికే పలుమార్లు ఆదేశించారు. దీంతో కలెక్టర్ దివాకరటీఎస్ జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించారు. జాతర సమీపిస్తుడడంతో అధికారులు మిగిలిన పనులన్నీ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే, ఎస్పీ శబరీశ్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీస్‌శాఖ పకడ్బందీ ఏర్పాట్లలో నిమగ్నమైంది.

జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

● ఎనిమిది రోజులు.. 200 బస్సులు.. 400 ట్రిప్పులు
● ఈ నెల 9 నుంచి 16 వరకు..
● మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం

హన్మకొండ/ఎస్ఎస్ తాడ్వాయి : ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో జరగనున్న మినీ జాతరకు టీజీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ మేరకు అధికారులు ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బస్సులు నడపనున్నారు. ఎనిమిది రోజులు.. 200 బస్సులు.. 400 ట్రిప్పులు నడిపేలా ప్రణాళిక రూపొందించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా అప్పటికప్పుడు బస్సులు పంపేందుకు సమాయత్తమయ్యారు. ఈ నెల 9 నుంచి ఉదయం 6 గంటల నుంచి హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి మేడారానికి బస్సులు నడపనున్నారు. 9న 15 బస్సులు, 10న 10, 11న 10, 12న 20, 13న 25, 14న 50, 15న 20, 16న 50 బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వీటితో పాటు అవసరమైతే అదనపు బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం..

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ప్రత్యేక బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం అమలు చేయనున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హనుమకొండ, మేడారం బస్ స్టేషన్లలో రోజూ డిపో మేనేజర్‌తో పాటు ఇద్దరు కంట్రోలర్లు ప్రత్యేక బస్సుల ఆపరేషన్ పర్యవేక్షిస్తారు.

భక్తులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మేడారం మినీ జాతరకు వెళ్లే భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రయాణికుల రద్దీని బట్టి హనుమకొండ నుంచి రోజూ 24 గంటల పాటు ప్రత్యేక బస్సులు నడుపుతాం. భక్తులను క్షేమంగా చేరవేయడమే లక్ష్యం. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఆర్థికంగా నష్టపోవద్దు. ప్రమాదాలకు గురి కావొద్దు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించి వనదేవతలను దర్శించుకోవాలి. వివరాలకు ఆర్టీసీ హనుమకొండ బస్ స్టేషన్ ఎంక్వైరీ 9959226056 నంబర్‌లో సంప్రదించాలి.

-డి.విజయ భాను, ఆర్టీసీ ఆర్ఎం, వరంగల్

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: అధ్యాపకులు పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ.. అకడమిక్ పరంగా ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కేయూ సెనెట్‌హాల్‌లో మంగళవారం అన్నివిభాగాలు, యూనివర్సిటీ కళాశాలల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల, ప్రొఫెసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అటెండెన్స్ కోసం ఫేస్ రికగ్నిజేషన్ టెక్నాలజీని అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్‌గా మార్చేలా ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. కే హబ్‌లోని పరిశోధన కేంద్రాలకు రూ.15 కోట్లు మంజూరైన నేపథ్యంలో పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.31 కోట్ల బడ్జెట్ ఉత్తర్వులు వచ్చాయన్నారు. అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీ ఏరియర్స్‌ను మార్చి వరకు బకాయిలు లేకుండా చెల్లిస్తామన్నారు. రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడారు.

లెర్నింగ్ నిరంతర ప్రక్రియ..

లెర్నింగ్ నిరంతర ప్రక్రియ అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. రెండు వారాలుగా ఇంటెన్సివ్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్సెల్ టూ పవర్ బీఐఫర్ ఎన్‌సీసీ జవాన్ల శిక్షణ కార్యక్రమం మంగళవారం కంప్యూటర్ సైన్స్ విభాగంలో ముగిసింది. ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శిక్షణ పొందిన జవాన్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ రామచంద్రం, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి రమ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మల్లారెడ్డి, డాక్టర్ మంజుల, డాక్టర్ రమేశ్, నీలిమ, సలోని ఫాతిమా, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పృథ్వీరాజ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రవిసునారే, తదితరులు పాల్గొన్నారు.

గాయపరిచిన ఘటనలో ఇద్దరికి జైలు

మహబూబాబాద్ రూరల్ : ఓ వ్యక్తిని గాయపరిచిన ఘటనలో ఇద్దరికి ఏడాది చొప్పున జైలు శిక్ష, రూ. 4 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ తిరుపతి మంగళవారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి చిగురు నరేందర్ కథనం ప్రకారం.. 2018 అక్టోబర్ 26వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం (వి)లో వినాయక చవితి సందర్భంగా చిలుముల నరేశ్ నృత్యం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసరెడ్డి, ఆరెందుల కుమారస్వామి.. నరేశ్‌తో వాగ్వాదానికి దిగి అతడిపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై నరేశ్ అదే రోజు కేసముద్రం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై బి.సతీశ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించి 2019 జనవరి 7వ తేదీన కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలత కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్ రాజు ఆధ్వర్యంలో సీడీఓ నరేందర్ సాక్షులను ప్రవేశపెట్టారు. వాదనలు విన్న ఏ.జే.ఎఫ్.సీ.ఎం తిరుపతి.. నేరం నిరూపణ కాబడిన శ్రీనివాసరెడ్డి, కుమారస్వామికి ఏడాది చొప్పున జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

విద్యారంగానికి తక్కువ నిధులు

● ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని, మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేదని కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కళాశాలలోని ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చర్చలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేతన జీవులకు సంవత్సరానికి రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం ఊరటనిచ్చే అంశమని తెలిపారు. ఎకనామిక్స్ విభాగం ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్‌తో సామాన్యులు ఏమీ లాభంలేదని తెలిపారు. ఉద్యోగ రంగాలకు కేటాయింపులు లేవన్నారు. బీసీ జాక్ చైర్మన్ డాక్టర్ తిరునహరిశేషు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్

● 5 రైల్వే స్టేషన్లలో 10 రైళ్లకు..

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో పలు రైళ్లకు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్ కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు. ఆయా రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కొనసాగుతున్న రైళ్లకు ప్రయోగాత్మక హాల్టింగ్ మరో 6 నెలల పాటు పొడిగించినట్లు తెలిపారు.

హాల్టింగ్ కల్పించిన రైళ్లు ఇవే..

వరంగల్‌లో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి చెన్నై సెంట్రల్–హజ్రత్‌నిజాముద్దీన్ (12611) ఎక్స్‌ప్రెస్, బెల్లంపల్లిలో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి హజ్రత్‌నిజాముద్దీన్–తిరుపతి (12708) ఎక్స్‌ప్రెస్, ఖమ్మంలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఎర్నాకులం–పాట్నా (22669) పాట్నా ఎక్స్‌ప్రెస్, పెద్దపల్లిలో ఫిబ్రవరి 4 తేదీ నుంచి చెన్నై సెంట్రల్–అహ్మదాబాద్ (12656) నవజీవన్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 3వ తేదీ నుంచి అహ్మదాబాద్–చెన్నై సెంట్రల్ (12655) నవజీవన్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 4వ తేదీ నుంచి సికింద్రాబాద్–హిసర్ (22737) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 6వ తేదీ నుంచి హైదరాబాద్–రక్సోల్ (17006) రక్సోల్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 9వ తేదీ నుంచి రక్సోల్–హైదరాబాద్ (17005) రక్సోల్ ఎక్స్‌ప్రెస్, నెక్కొండలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి సికింద్రాబాద్–గుంటూరు(12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు–సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు 6 నెలల పాటు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.